క్లుప్తంగా

శ్రీపాద శ్రీవల్లభస్వామికి పుష్ప పూజ



స్వామివారికి సహస్ర లిల్లీ పుష్ప పూజ నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలోని శ్రీపాద శ్రీ వల్లభ మహా సంవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి సహస్ర లిల్లీ పుష్ప పూజ జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. శ్రీపాద శ్రీవల్లభ స్వామివారి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్ సౌజన్య తెలిపారు. మహోత్సవాల సందర్భంగా మహారాష్ట్ర భక్తులు భారీగా తరలివస్తున్నారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

గణేశ్ ఉత్సవాలకు పందిరి రాట



కొత్తపల్లిలో పందిరి రాట వేస్తున్న భక్తులు

కొత్తపల్లి: గణపతి నవరాత్ర ఉత్సవాలను నిర్వహించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆలయాలు, తాత్కాలిక మందిరాల వద్ద పందిరి రాట ముహూర్తాలు చేశారు. స్థానిక బీటు వీధిలో ఏర్పాటు చేసే గణపతి మందిరాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. గణేశ్ యూత్ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. నవరాత్రుల సందర్భంగా భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం



జోస్యుల కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

సామర్లకోట: రాజమహేంద్రవరానికి చెందిన దివంగత జోస్యుల వెంకటసోమయాజులు జ్ఞాపకార్థం ఆయన భార్య జోస్యుల సుబ్బలక్ష్మి స్థానిక పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి రూ.50,014 నగదు విరాళంగా అందజేశారు. ఆలయంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో అన్నదానానికి విరాళం సమర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ఆలయ పండితులు ఆశీర్వచనాలు, ఆలయ సిబ్బంది ప్రసాదం అందజేశారు.

గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో 15 ఏళ్ల లోపు పిల్లలకు నిర్వహించిన గణేశ పంచరత్న పోటీలకు విశేష స్పందన వచ్చింది. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఐవీ రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలుత జూనియర్స్ విభాగంలో ఐదు నుంచి పదో సంవత్సరం వరకు, సీనియర్స్ విభాగంలో 11 నుంచి 15 ఏళ్ల లోపు ఉంటుందని చెప్పారు. సుమారు 30 పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ భారతీయ ఇతిహాస పురాణాలకు చెందిన విషయాలు నేటితరానికి పరిచయం చేయడం ద్వారా వాటి గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అందులో భాగమే పండగల విశిష్టతను చిన్నతనం నుంచే పిల్లలకు పరిచయం చేయవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయ నిర్ణేతలుగా సీఎస్ సత్యనారాయణ, ఆకొండి సూర్యనారాయణ, వాసుదేవరావు, జానకీరామ్ చౌదరి వ్యవహరించారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం భమిడిపాటి లాస్య, ద్వితీయ జుత్తుక అన్నపూర్ణాదేవి, తృతీయ స్థానం కౌశిక్ పొందారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ జి.కృష్ణ సంహిత, ద్వితీయ లాస్య, తృతీయ బహుమతి వేదిత కైవసం చేసుకున్నారు. ఆయా విభాగాలకు 20 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వినాయక వ్రత కల్ప పుస్తకం, వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు ఇంద్రగంటి శ్రీనివాస్, అయ్యగారి వెంకటేష్, మండలీక శాస్త్రి, సీతారామశాస్త్రి, రంగాభట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపం



ఉచిత పంపిణీకి సిద్ధం చేసిన మట్టి ప్రతిమలు

- నవరాత్ర ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపాలు
- మట్టి విగ్రహాల ఉచిత పంపిణీలో స్వచ్ఛంద సంస్థలు
- వేదికల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి
- తొమ్మిదో రోజు నిమజ్జనం ఉత్తమమంటున్న పండితులు

సామర్లకోట: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు నియోజకవర్గంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్ల వద్ద, షాపులు, వ్యాపార సంస్థలు, ముఖ్య కూడళ్లలో తాత్కాలిక మందిరాలు ఏర్పాటు చేసి గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో గ్రామగ్రామాన, వార్డుల్లోనూ వివిధ సంఘాల కార్యాలయాలు, ఆటో, లారీ, టాక్సీ స్టాండ్లలో ఉత్సాహంగా మందిరాలు నెలకొల్పుతున్నారు. పట్టణ పరిధిలో ఉన్న గణపతి ఆలయాలను విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో అలంకరణలు చేశారు. భాద్రపద మాసంలో వచ్చే తొలి చవితి రోజున వినాయక చవితి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గణపతిని పూజించడం వల్ల అన్ని విఘ్నాలు తొలగి, మంచి జరుగుతుందని ప్రజల నమ్మకం. గణపతి నవరాత్ర ఉత్సవాలంటే ప్రజల్లో సందడి నెలకొంటుంది. చవితి రోజున వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేసి, పూజలు చేస్తుంటారు. ఆయా శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని పూజించి, తొమ్మిది రోజుల తరువాత నిమజ్జనం చేస్తారు. ఆయా మండపాల్లో నిర్వాహకుల సామర్థ్యాన్ని బట్టి నిమజ్జన ఊరేగింపులు ఉంటాయి. గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన తొమ్మిది రోజుల తరువాత నిమజ్జనం చేస్తారు. కొంత మంది 11, 13, 21 రోజుల తరువాత నిమజ్జనం చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. చంద్ర గ్రహణం రావడంతో తొమ్మిది రోజుల్లోనే నిమజ్జనం చేయడం ఉత్తమమని పండితులు సూచిస్తున్నారు.

ముందుగా అనుమతి తీసుకోవాలి



గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. శిబిరాల నిర్వాహకులు కమిటీలుగా ఏర్పాటు కావాలి. మైక్ ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదు. అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలి. నిమజ్జనం సమయంలో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవు. నిమజ్జనాలకు పిల్లలు, మహిళలను దూరంగా ఉంచాలి. పోలీసులు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాల్సి ఉంటుంది.

– ఎ.కృష్ణభగవాన్, సీఐ, సామర్లకోట

చంద్ర గ్రహణం ఉన్నందున..



గణపతి నవరాత్ర ఉత్సవాలను ఈ నెల 27 ఉదయం 4.30 నుంచి పూజలు చేయడం శుభప్రదం. శిబిరాల్లో ఏర్పాటు చేసిన గణపతికి ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా పూజలు చేయాలి. సెప్టెంబర్ ఏడున రాత్రి 9.56కు చంద్ర గ్రహణం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని తొమ్మిది రోజుల్లో నిమజ్జనం చేయడం ఉత్తమం. 13, 21 రోజుల్లో నిమజ్జనం చేసేవారు గ్రహణాన్ని దృష్టిలో ఉంచుకుని 7న సాయంత్రం నుంచి విగ్రహాన్ని పూర్తిగా మూసివేయాలి. మరుసటి రోజున సంప్రోక్షణ చేయాల్సి ఉంటుంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, పంచారామ క్షేత్ర అభిషేక పండితులు, సామర్లకోట

మట్టి విగ్రహాల ఉచిత పంపిణీ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. ఇందులో భాగంగా పెదబ్రహ్మదేవానికి చెందిన శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఉచిత గణపతి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. అదే విధంగా లయన్స్ క్లబ్ నిర్వాహకులు ప్రతి ఏడాది ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను భక్తులకు అందజేస్తున్నారు. ఈ మట్టి ప్రతిమలకే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని చెబుతున్నారు. గత 11 ఏళ్లుగా స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వల్లపు రెడ్డి గోపాలకృష్ణ ఏర్పాటు చేస్తున్న శిబిరంలో మట్టి గణపతికి పూజలు చేస్తున్నారు. ప్రస్తుతం గాడిలంక నుంచి 11 అడుగుల మట్టి విగ్రహాన్ని తీసుకొచ్చి శిబిరంలో ఏర్పాటు చేశారు.

ముస్తాబవుతున్న వినాయక ఆలయాలు



కొత్తపల్లిలో విగ్రహాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

పిఠాపురం: వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంలో వినాయక ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే ఆలయాలకు కొత్త రంగులు వేసి, చలువ పందిళ్ల ఏర్పాటు చేసే పనుల్లో ఆలయ కమిటీలు నిమగ్నమయ్యాయి. మరోవైపు వివిధ గ్రామాల్లో వినాయక మంటపాలు నెలకొల్పడానికి అన్ని వీధుల్లో ఉత్సవ కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. పిఠాపురంలో ప్రముఖ వినాయక ఆలయమైన జైగణేశ్ ఆలయంలో చవితి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని ఇప్పటికే సర్వం సిద్ధం చేయగా, విద్యుద్దీపాలంకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు వినాయక విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. రూ.500 నుంచి రూ.50 వేల వరకు విలువైన భారీ విగ్రహాలను ఉత్సవ నిర్వాహకులు కొనుగోలు చేసి, వాటిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీతో పాటు, గొల్లప్రోలు నగర పంచాయతీ, కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో సుమారు 300 వినాయక మంటపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. ఇప్పటికే అన్ని గ్రామాల్లోను వినాయక మంటపాల ఏర్పాట్లు జోరందుకున్నాయి. వివిధ గ్రామాల్లో ఉన్న వినాయక ఆలయాలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయాలు, మంటపాల వద్ద ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ పనులు జోరుగా చేపట్టారు. వివిధ భంగిమల్లో ఉన్న వినాయకుని భారీ విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ఉత్సవ కమిటీల వారు.. వాటిని మంటపాల వద్దకు చేరుస్తున్నారు. మంటపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్న నిబంధనతో నిర్వాహకులు తమ పరిధిలోని పోలీసు స్టేషన్లను సంప్రదిస్తున్నారు.



పిఠాపురంలో ఉత్సవాలకు ముస్తాబైన జైగణేశ్ ఆలయం

బీచ్ రోడ్డులో పోలీసుల ప్రత్యేక డ్రైవ్



ఉప్పాడ బీచ్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై ఉప్పాడ బీచ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాటి రికార్డులను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు ఈ–చలానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. వీరితో పాటు, అమాయకులు కూడా ప్రమాదాల బారినపడి క్షతగాత్రులు కావడమో, ప్రాణాలు కోల్పోవడమో జరుగుతుందని తెలిపారు.

తీర ప్రాంత రక్షణపై ఆందోళన

- వచ్చే నెల 21న నిరాహార దీక్ష
- తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి



కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వెంకటేశ్వరరావు తదితరులు

కొత్తపల్లి: ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని బీసీ ఉద్యమ నాయకుడు, తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 21వ తేదీన ఉప్పాడ బీచ్ రోడ్డులో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం పోలీసులకు పత్రాలు సమర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీర ప్రాంతంలో ఉన్న కోనపాపపేట, ఉప్పాడ ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసివెళ్లడమే మినహా, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీర ప్రాంతంలో జనావాసాలు కనుమరుగవుతాయన్నారు. కరప మండలం ఉప్పలంక నుంచి తొండంగి మండలం అద్దరిపేట వరకూ ఉన్న 67 మత్స్యకార గ్రామాల్లో నెలకు రూ.11,500 పరిహారంగా ఇవ్వాలన్నారు. వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడికీ రూ.50 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న యువతకు జిల్లాలోని పరిశ్రమల్లో 20 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఆయా డిమాండ్లపై సెప్టెంబర్ 21న మత్స్యకారులతో కలిసి ఉప్పాడలో నిరాహార దీక్షను చేపడుతున్నట్టు వివరించారు.

సీఎం పర్యటనతో ఒరిగిందేమిటో..?

- ప్రభుత్వ ఆస్తుల ప్రైవేట్‌పరం కోసమేనా!
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల



సమావేశంలో మాట్లాడుతున్న సూరిబాబు

పెద్దాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వల్ల పెద్దాపురం పట్టణానికి ఒరిగిందేమీ లేదని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ ప్రకటనకే ముఖ్యమంత్రి పర్యటన జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం పర్యటన వల్ల పెద్దాపురం పట్టణానికి ఒరిగిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంతోకాలంగా వంద పడకల ఆసుపత్రి కోసం ఎదురుచూస్తుంటే, అది ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహిస్తామని చెప్పడం ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ వారి చేతుల్లో పెట్టడమేనని విమర్శించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా టీడీపీ నేత చినరాజప్పను ప్రజలు గెలిపించారని, హాస్పిటల్‌ను ప్రైవేట్‌పరం చేయడమే పెద్దాపురం ప్రజలకు ఇచ్చే బహుమతా అని నిలదీశారు. 11 గ్రామాల ప్రజలకు ఇచ్చిన రామేశ్వరంపేటలో ఇళ్ల స్థలాలు ఏమయ్యాయని, అక్కడే చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్ పెడతారని చెబుతున్నారని, ప్రభుత్వం ఆ స్థల పరిశీలన చేసిందా అని ప్రశ్నించారు. పర్యావరణాన్ని ప్రజల జీవనానికి ఇబ్బంది పెట్టే ఫ్యాక్టరీని అనపర్తి, బిక్కవోలు ప్రాంతాల్లో వద్దని చెబితే, అదే ప్లాంట్ రూ.330 కోట్లతో పెద్దాపురం పట్టణంలో పెట్టడం ఏమిటని నిలదీశారు. మున్సిపల్ శానిటరీ వర్కర్లకు శాలువా కప్పే ముఖ్యమంత్రికి పెద్దాపురం మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్లను పెంచాలనే విషయం మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే డిగ్రీ కళాశాల ప్రకటన చేశారని గుర్తుచేశారు. తొందరగా కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజల కోసం ఉపయోగపడే ప్రాజెక్టులకు సీపీఎం మద్దతు ఉంటుందని, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై తప్పక పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు సిరపురపు శ్రీనివాస్, రొంగల వీర్రాజు, సుబ్బలక్ష్మి, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో విశేష ప్రతిభ



వల్లు సాయికుమార్



బందారు దేవీమణికంఠ



కడిమిశెట్టి అశోక్‌రెడ్డి



చంద్ర శ్రీనివాసారెడ్డి

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు డీఎస్సీ తాజా ఫలితాల్లో ర్యాంకులు సాధించారు. వారిని ఆదివారం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందించారు. గోర్స గ్రామానికి చెందిన బందారు దేవీ మణికంఠ స్కూల్ అసిస్టెంట్‌గా 9వ ర్యాంకు సాధించారు. నాగులాపల్లికి చెందిన కడిమిశెట్టి అశోక్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌లో మొదటి ర్యాంకు పొందారు. అదే గ్రామానికి చెందిన బిళ్లకుర్తి సత్యమానిక బయాలజీలో స్కూల్ అసిస్టెంట్ 76వ ర్యాంకును సాధించింది. పాత ఇసుకపల్లికి చెందిన తమిలిశెట్టి చంద్ర శ్రీనివాసారెడ్డి బయాలజీలో స్కూల్ అసిస్టెంట్ 13వ ర్యాంకు సాధించాడు. మండలంలోని గోర్స గ్రామానికి చెందిన వల్లు సాయికుమార్ ఎస్జీటీ ఎంపికలో 15వ ర్యాంకును సాధించారు. ప్రస్తుతం ఈయన కోనసీమ జిల్లా అమలాపురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. నాగులాపల్లి గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి నాగవెంకట వీరభద్రారెడ్డి ఎస్జీటీ 162వ ర్యాంకు సాధించారు.

ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాస్



నూతన కార్యవర్గంతో సంఘ సభ్యులు

సామర్లకోట: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా వేము శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వేట్లపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ప్రధాన కార్యదర్శిగా కరక రామకృష్ణ, కోశాధికారిగా పేకేటి శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా జిత్తుక శేఖర్, సహాయ కార్యదర్శిగా అడపా వెంకి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాలిక జయబాబు, మేడిశెట్టి లోవరాజు, పలివెల వెంకటరమణ, రెడ్డిమల్లి జానీ, ద్వారంపూడి వీరేంద్ర ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా సంఘ ప్రతినిధుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది.

పెద్దాయన జ్ఞాపకాలు మరువలేం

- కురసాల సత్యనారాయణకు నేతల ఘన నివాళి
- వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు కిట్టు ఆధ్వర్యంలో సంతాప సభ



సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ కిట్టు, ఇతర నాయకులు

కాకినాడ రూరల్: అందరితో ఆత్మీయంగా ఉండే పెద్దాయన కురసాల సత్యనారాయణ లేని లోటు తీర్చలేనిదని, ఆయనతో జ్ఞాపకాలు, అనుబంధాలు మరువలేమని పలువురు వక్తలు శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన సంగతి విదితమే. వైఎస్సార్ సీపీ రూరల్ మండల కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ(కిట్టు) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక బోట్‌క్లబ్ ఎదురుగా కృషి భవన్‌లో కురసాల సత్యనారాయణ సంతాప సభ జరిగింది. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాకినాడ సిటీ, కరప మండలాలకు చెందిన పలువురు నేతలు సంతాప సభకు హాజరయారు. బాబాయ్ గారు అంటూ ఆప్యాయంగా పిలుచుకునే సీనియర్ నేత సత్యనారాయణతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. తొలుత జెడ్పీటీసీ కిట్టు ఆధ్వర్యంలో సత్యనారాయణ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ, బాబాయ్ సత్యనారాయణతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. మంత్రిగా కన్నబాబు బిజీగా ఉన్నప్పుడు క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి, సాధకబాధకాలు తెలుసుకోవడంతో పాటు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసేవారన్నారు. పలువురు నేతలు మాట్లాడుతూ, కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సత్యనారాయణ చేసిన సేవలు మరవలేమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద దిక్కును కోల్పోయారన్నారు. ఈ బాధాకరమైన సమయంలో ఆయన కుమారులు కన్నబాబు, కల్యాణ్‌కృష్ణకు అండగా ఉంటామన్నారు.